సాక్షి
అనంతపురం
శుక్రవారం ♦ 21 ♦ మార్చి ♦ 2025




టన్ను చీనీ రూ.26 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26 వేలు ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.8

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.8, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.7 ప్రకారం ధర పలికింది.



రథోత్సవం హైలెట్స్

కదిరి: శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నారసింహుడు ఆశీనులైన బ్రహ్మరథం సరిగ్గా ఉదయం 8.15 గంటలకు ప్రారంభమైంది. తేరుమోకులు రెండు సార్లు తెగిపోవడంతో ఈసారి బాగా ఆలస్యమైంది. మధ్యాహ్నం 3.53 గంటలకు తేరు యథాస్థానం చేరుకుంది.

- ముందుగా చౌక్ సర్కిల్‌లో తేరు మోకు తెగింది. దీంతో అక్కడ గంటన్నరకు పైగా ఆలస్యమైంది. తర్వాత హిందూపురం సర్కిల్‌లో మరోసారి మోకు తెగడంతో అక్కడ కూడా గంటకు పైగా ఆలస్యమైంది.
- రథం తిరువీధుల గుండా వెళ్తుంటే భక్తులు దవనం, మిరియాలు, అరటి పండ్లు రథంపైకి విసిరి మొక్కులు చెల్లించుకున్నారు.
- రథం వెళ్లాక రోడ్డుపై పడిన మిరియాలను భక్తులు ఒక్కోటి సేకరించడం కన్పించింది. అవి కొన్ని రకాల వ్యాధులను నయం చేస్తాయని వారి నమ్మకం.
- యువత చొక్కాలు చింపడం, రంగులు చల్లుకోవడం కనిపించింది.
- మిద్దెలపై నుంచి కొందరు రథంలాగే భక్తుల మీదకు బిందెలతో నీళ్లు చల్లారు. మరికొందరు నీళ్ల ప్యాకెట్లు విసిరారు.
- భక్తుల కోసం పట్టణంలో ఈసారి కూడా అడుగడుగునా ఉచిత అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేశారు. మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లను పెద్ద ఎత్తున పంచిపెట్టారు.
- బ్రహ్మోత్సవాల కోసం ఆర్టీసీ ప్రతినిధులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.
- నృసింహాలయంలో భక్తుల సంఖ్య ఎక్కువ కావడంతో స్వామి వారిని దర్శించుకోవడానికి వెళ్లిన భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండటం కన్పించింది.
- కదిరి బ్రహ్మ రథోత్సవంలో 3 లక్షల మంది భక్తులు పాల్గొన్నట్లు అంచనా.
- రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ వి.రత్న దగ్గరుండి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


పసుపు, కుంకుమ కొనుగోలు చేస్తున్న భక్తులు

నేడు అలుకోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు అశ్వవాహనంపై తిరువీధుల్లో దర్శనమివ్వనున్నారు. అంతకుముందు యాగశాలలో నిత్యహోమం నిర్వహించి శ్రీవారిని విశేషంగా అలంకరించనున్న అర్చకులు..రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ఆలయం పక్కనే ఉన్న సుద్దుల మంటపం వద్దకు తీసుకువచ్చి అలుకోత్సవాన్ని నిర్వహించనున్నారు.

ఖాద్రీశా.. గోవిందా


అశేష భక్తజనం నడుమ సాగుతున్న ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మ రథోత్సవం, (ఇన్‌సెట్‌లో) విశేషాలంకరణలో ఖాద్రీశుడు

- వైభవంగా లక్ష్మీనారసింహుడి బ్రహ్మ రథోత్సవం
- మండుటెండనూ లెక్కచేయక లక్షలాదిగా తరలివచ్చిన జనం
- సర్వాలంకృతుడైన శ్రీవారి దర్శనంతో పులకించిన భక్తజనం
- గోవింద నామస్మరణతో మార్మోగిన కదిరి
- మధ్యాహ్నం 3.53 గంటలకు యథాస్థానానికి చేరుకున్న తేరు

కదిరి ఆధ్యాత్మిక కడలిని తలపించింది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనతరంగం ఉప్పెనలా ఎగసింది. 'నమో నారసింహ... గోవిందా' నామస్మరణ ప్రతిధ్వనించింది. భక్తిభావం ముందు భగభగ మండే భానుడే వెలవెలబోగా..ఆధ్యాత్మిక శోభ వెల్లివెరిసింది. ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవం వేళ చిన్నా, పెద్దా తారతమ్యం మరచి అందరూ భక్తిపారవశ్యంలో మునిగితేలారు. దవనం, మిరియాలు స్వామివారి రథంపై చల్లి మొక్కులు చెల్లించుకున్నారు.

కదిరి: ఖాద్రీ లక్ష్మీనారసింహుని బ్రహ్మ రథోత్సవం గురువారం అశేష భక్తజనం మధ్య అత్యంత వైభవంగా జరిగింది.'శ్రీలక్ష్మీ నరసింహ స్వామి గోవిందా..గోవిందా, ప్రహ్లాద వరద గోవిందా..గోవిందా, జయ జయ సింహా..జయ నరసింహా'' అంటూ భక్తులు కీర్తించగా.. గోవింద నామ స్మరణతో కదిరి మార్మోగింది. బ్రహ్మ రథోత్సవం నాడు సాక్షాత్తు బ్రహ్మ దేవుడే రథాన్ని నడిపి శ్రీవారు తిరువీధుల్లో విహరించేందుకు సహకరించి భక్తులంతా స్వామిని దర్శించుకునేలా చూస్తారని భక్తుల నమ్మకం.

మూడు గంటల ఆలస్యం..

ఉదయం సరిగ్గా 8.15 గంటలకు బ్రహ్మరథం ముందుకు కదిలింది. తిరువీధుల్లోని చౌక్ సర్కిల్‌లో ఒక సారి, హిందూపురం సర్కిల్‌లో మరోసారి.. ఇలా రెండు సార్లు తేరు మోకులు తెగిపోవడంతో గంటన్నర చొప్పున మూడు గంటలు ఆలస్యమైంది. సరిగ్గా మధ్యాహ్నం 3.53 గంటలకు బ్రహ్మరథం యథాస్థానం చేరుకుంది. రథం యథాస్థానం చేరుకోవడానికి గతంలో ఎన్నడూ ఇంత ఆలస్యం కాలేదు.

బలిహరణం, ఆస్థాన పూజలతో మొదలు..

ఉదయాన్నే ఆలయ అర్చక బృందం తేరు ముందు బలిహరణం, ఆస్థాన పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, పట్టణ ప్రముఖులు రథం వద్ద జరిగిన తొలి పూజల్లో పాల్గొని, తర్వాత రథంపై శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రథాన్ని కాసేపు లాగి తమ భక్తిని చాటుకున్నారు. తిరు వీధుల ఆక్రమణల కారణంగా బ్రహ్మరథం లాగేందుకు భక్తులు ఇబ్బంది పడ్డారు. ఓ వైపు ఎండలు మండుతున్నా భక్తులు తమ ఇలవేల్పును దర్శించుకొని రథంపైకి దవనం, మిరియాలు చల్లేందుకు గంటల తరబడి వేచి ఉన్నారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, ఆయన కుమారుడు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు వంశీకృష్ణ ఎప్పటిలాగానే రథంపై నిల్చొని రథ కదలికలను మైకు ద్వారా తెలియజేశారు.

మండుటెండలోనూ...

ఎండలు మండుతున్నప్పటికీ భక్తులు ఏమాత్రం లెక్కచేయలేదు. భక్తుల దాహార్తి తీర్చడానికి దాతలు అడుగడుగునా మంచినీటి ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ముందురోజు అంటే బుధవారం రాత్రి ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు ఐరావతంపై తిరు వీధుల గుండా భక్తులకు దర్శనమిచ్చి తిరిగి ఆలయం చేరుకున్నారు. తెల్లవారు జామున శుభ ఘడియల్లో రథారోహణం గావించారు. ఆనవాయితీగా వస్తున్న మూర్తిపల్లి, బేరిపల్లి, కుటాగుళ్ల, నాగిరెడ్డిపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామస్తులు రథానికి సంద్ర మొద్దులు, తెడ్లు వేస్తూ రథ గమనాన్ని నియంత్రిస్తుంటే పెద్ద సంఖ్యలో భక్తులు బ్రహ్మ రథాన్ని లాగారు. రథం ముందు వెళ్తుంటే వెనుక భాగాన అగ్నిమాపక వాహనంతో పాటు ప్రథమ చికిత్సకు సంబంధించిన అంబులెన్స్ వాహనాలు వెళ్లాయి. తొక్కిసలాటలో స్వల్పంగా గాయపడిన భక్తులకు ఎప్పటికప్పుడు అక్కడే ప్రథమ చికిత్స చేస్తూ ముందుకు సాగిపోయారు.

దవనం.. స్వామి కోసం


దవనం, పూలను కొనుగోలు చేస్తున్న భక్తులు

పుణ్యం.. అన్నదానం


భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

భద్రత.. కట్టుదిట్టం


భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్పీ రత్న

న్యూస్‌రీల్

ఈ-కేవైసీ చేయించుకోండి

- రేషన్ కార్డుదారులకు జేసీ సూచన

అనంతపురం అర్బన్: రేషన్ కార్డులోని సభ్యులందరూ ఈనెల 31వ తేదీలోపు ఈ-కేవైసీ చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సూచించారు. ఇందుకు సంబంధించి వివరాలను గురువారం తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా 2,65,450 మంది సభ్యులు ఇప్పటికీ ఈ-కేవైసీ చేసుకోలేదన్నారు. ఈ-కేవైసీ చేయించుకున్నవారికి మాత్రమే ఏప్రిల్‌లో నిత్యావసర సరుకులు అందుతాయన్నారు. ఈ-కేవైసీ నమోదు కాని వారి జాబితా సంబంధిత ప్రాంత చౌకధరల దుకాణపు డీలరు, గ్రామ రెవెన్యూ అధికారి, సీఎస్‌డీటీ వద్ద ఉంటుందన్నారు. వారిని సంప్రదించి ఈ-పాసు యంత్రంలో వేలిముద్ర వేయాలన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం.. ఎమ్మెల్యే తనయుడి దర్పం


ఎంపీడీఓ సీటులో కూర్చున్న గుమ్మనూరు ఈశ్వర్

పామిడి: కూటమి సర్కారులో వింత పోకడలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యేల కుటుంబీకులు, బంధువులు కూడా అనధికార ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. అధికారులు కూడా స్వామి భక్తి ప్రదర్శిస్తూ జీ హుజూర్ అంటున్నారు. వివరాలు.. పామిడి పట్టణ ఎంపీడీఓ కార్యాలయానికి గురువారం గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్ వచ్చారు. ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో చలివేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలోకి ప్రవేశించిన ఆయన.. అక్కడ ఎంపీడీఓ సీటులో ఆసీనులై దర్పం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ తేజోత్స్న, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి కనబరిచిన స్వామి భక్తి అందరినీ ముక్కున వేలేసుకునేలా చేసింది.

పార్టీల ప్రతినిధులతో ప్రతి నెలా సమావేశం

- ఓటరు జాబితాపై చర్చించి సలహాలు స్వీకరిస్తాం
- ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుదాం
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్‌కుమార్


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ' భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇకపై ప్రతినెలా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తాం. సలహాలు, సూచనలు స్వీకరిస్తాం' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి వారంలో సమావేశం ఉంటుందన్నారు. ఓటరు జాబితా సవరణ, తదితర అంశాలపై చర్చించి సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు. చర్చించిన అంశాలపై నివేదికలను 20వ తేదీలోపు ప్రధాన ఎన్నికల అధికారికి పంపుతామన్నారు. ఓటరుగా నమోదు, జాబితాలో ఓటు తొలగింపు, వివరాల మార్పు నిరంతర ప్రక్రియ అని, ఇందుకు సంబంధించిన దరఖాస్తులపై ఎప్పటికప్పుడు విచారణ చేసి పరిష్కరిస్తామన్నారు. పార్లమెంటరీ ఓటర్ల జాబితా, ఎలక్టోరల్ రోల్స్ తయారీ, ఎన్నికల చట్టాలు, నియమాల్లో సవరణలు, ఎన్నికల సేవల ఫారాల్లో సవరణలు, ఓటర్ల నమోదు నియమాలు, 1960 కింద సూచించిన ఫాంలు, బల్క్ అప్లికేషన్ సూచనల సమర్పణ, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీలు (డీఎస్‌ఈ), బీఎల్‌ఏల నియామకం, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ తదితర వివరాలతో కూడిన నివేదికలను ఇస్తామన్నారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంచే విధంగా ఎన్నికలకు సంబంధించిన ప్రతి ప్రక్రియ సజావుగా జరిగేలా అందరూ సహకరించాలన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం తహసీల్దారు యుగేశ్వరిదేవి, డీటీ కనకరాజు, ఐటీ అసిస్టెంట్ శివ, పార్టీల ప్రతినిధులు సోమశేఖర్‌రెడ్డి, ఇమాంవలి, నారాయణ స్వామి, కిరణ్‌కుమార్, బాలరంగయ్య, రామాంజినేయులు, అంజయ్య, మసూద్‌ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

గుడిలో ఇంటి దొంగలు

- పెన్నహోబిలం ఆలయ హుండీలోని బంగారు మూట మాయం
- ఆలయ సిబ్బంది చేతివాటం
- పంపకాల్లో తేడాలతో బహిర్గతం


అర్చకులతో వివరాలు సేకరిస్తున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషనాయుడు

ఉరవకొండ: ఓ సినిమాలో అమాయకుల నుంచి బంగారు మూటను కమెడియన్ కొట్టేస్తారు. తన సహచరులతో కలిసి నగల పంపకాలకు కూర్చుంటారు. 'నీకు... నాకు..' అంటూ అందరూ పంచుకుంటుండగా.. హీరో ఎంట్రీ ఇచ్చి అందరి పని పడతాడు. అచ్చం ఇలాగే.. పెన్నహోబిలం పుణ్యక్షేత్రంలో ఓ ఘటన జరిగింది. అయితే, ఇక్కడ మాత్రం ఇంటి దొంగలే దొంగతనానికి పాల్పడినట్లు తెలిసింది. లక్షలాది మంది ఇలవేల్పుగా కొలుచుకునే సాక్షాత్తూ నారసింహుడి ఆలయంలోనే చోటుచేసుకున్న ఈ ఘటన సర్వత్రా చర్చనీయాంశమైంది. వివరాలు.. ఉరవకొండ మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన వేలూరు రంగయ్య, వనజాక్షి దంపతులు ఈనెల 7న పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం మొక్కు మేరకు వనజాక్షి తన ఒంటిపై ఉన్న బంగారు నగలన్నీ మూటకట్టి హుండీ ద్వారా స్వామి వారికి సమర్పించింది. ఆమె ఆభరణాలు హుండీలో వేస్తున్న సమయంలో అక్కడే ఉన్న ఓ అర్చకుడితో పాటు ఆలయ సిబ్బంది గమనించారు. ఈనెల 18న ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు ఆధ్వర్యంలో స్వామి వారి శాశ్వత హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించగా... నగల మూటను చాకచక్యంగా మాయం చేశారు. హుండీ లెక్కింపు పూర్తయ్యాక పంచుకోవడానికి మాస్టర్ ప్లాన్ వేశారు. ఈ క్రమంలోనే ఓ గదిలో కూర్చుని పంపకాలు చేసుకుంటుండగా వారిలో వారికే తేడాలు వచ్చాయి. విషయం బయటకు పొక్కడంతో ఆలయ ఈఓ, అర్చకులు, సిబ్బంది సమక్షంలో తిరిగి నగల మూటను హుండీలో వేసినట్లు తెలుస్తోంది.

ఆభరణాలు మాయం!

వేలూరు రంగయ్య దంపతులు స్వామి వారికి సమర్పించిన ఆభరణాలను మాయం చేసిన ఘటనపై దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) ఆదిశేషనాయుడు విచారణ చేపట్టారు. అయితే బంగారు మూటలో రూ.5 లక్షలకుపైగా విలువ చేసే ఆభరణాలు ఉండగా, ఇందులో ముక్కుపుడక, బంగారు పట్టీలు మాయమైనట్లు గుర్తించారు. దీనిపై విచారణ చేపట్టి 15 రోజుల్లో పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని, బాధ్యులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఏసీ తెలిపారు.

ఉష్ణోగ్రతలు పెరుగుతాయ్!

బుక్కరాయసముద్రం: ఉమ్మడి జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పెరగనున్నట్లు రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పగటి ఉష్ణోగ్రతలు 40–41.1, రాత్రి ఉష్ణోగ్రతలు 23.3–24 డిగ్రీల సెల్సియస్ నమోదు కావొచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 59–62 శాతం, మధ్యాహ్నం 15–20 శాతంగా నమోదయ్యే అవకాశముందన్నారు.

EAMCET TARGET 120+ Marks
NEET TARGET 600+ Marks | JEE TARGET 160+ Marks
తేజ
9948567527, 9490859421

EAPCET 2nd BATCH STARTS : 20th MARCH
NEET | JEE-IIT
AC CAMPUS | ONLY GIRLS
GLOBAL SCHOOL COLLEGE Near SJR Function Hall Opp.TV Tower, ANANTAPUR
9247134363, 8555826272 | హాస్టల్ కలదు

EAMCET NEET JEE
APRJC RDT పాలిసెట్
హాస్టల్ కలదు Classes Starts : 21st March
SARADA ACADEMY 2వ క్రాస్, అశోక్‌నగర్, అనంతపురము
9866117303, 9908829351

NRI
Short Term Coaching for
IIT / NEET EAPCET
NRI is The Best !
Classes Starts from 24-03-2025
Separate Hostel for Girls & Boys
SJR Edu Plaza, Near Super Speciality Hospital
JNTUA Road, ANANTAPURAMU
9333966663, 8019545433

ప్రభుత్వ విద్యార్థులకు బంపర్ ఆఫర్


విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ట్రైనీ కలెక్టర్ వినూత్న

అనంతపురం ఎడ్యుకేషన్: 'సైన్స్ ఎక్స్‌పోజర్'లో భాగంగా జిల్లా నుంచి పలువురు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల విద్యార్థులు బెంగళూరు నగరంలోని విశ్వేశ్వరయ్య మ్యూజియం సందర్శనకు బయలుదేరారు. జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌తో పాటు వివిధ జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటిన 8,9 తరగతుల బాలికలు 84 మంది, బాలురు 39 మంది వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ఎంపిక చేసిన విద్యార్థులను గురువారం సాయంత్రం జిల్లా కేంద్రానికి పిలిపించారు. రాత్రి భోజన సదుపాయం కల్పించారు. బాలికలకు రుద్రంపేట సర్కిల్‌లోని వాల్మీకి కల్యాణమంటపం, బాలురకు ఉపాధ్యాయ భవనంలో వసతి కల్పించారు. సైన్స్ టూర్ వెళ్లేందుకు మొత్తం మూడు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు బయలుదేరి తిరిగి శనివారం ఉదయానికి జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ నేతృత్వంలో 18 మంది పురుష, మహిళా టీచర్లు ఎస్కార్ట్‌గా వెళ్తున్నారు. పిల్లలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని ట్రైనీ కలెక్టర్ వినూత్న, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు సూచించారు.

క్లుప్తంగా

పోషణతో కూడిన విద్యనందించాలి



అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న నాగమణి

అనంతపురం సెంట్రల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు పోషణతో కూడిన విద్యనందించాలని కార్యకర్తలను ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగమణి ఆదేశించారు. అనంతపురంలోని చిన్మయానగర్‌లో ఉన్న ప్రాంగణంలో అనంతపురం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు 'పోషణ్ బీ- పడాయి బీ' కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పీడీ నాగమణి మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు పౌష్టికాహారంతో పాటు విద్య కూడా ముఖ్యమన్నారు. ఇది కూడా సాధారణంగా కాకుండా చిన్నారులకు అర్థమయ్యేలా ఉండాలన్నారు. సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో తల్లిదండ్రులనూ భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ లలిత, సూపర్‌వైజర్లు కొండమ్మ, విష్ణువర్ధిని, విజయ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్లకు మెమోల జారీ

శింగనమల: విధులపై నిర్లక్ష్యం కనబరిచిన శింగనమల మండలం సోదనపల్లి సచివాలయ విలేజ్ సర్వేయర్ శివానంద, వెస్ట్ నరసాపురం సచివాలయ విలేజ్ సర్వేయర్ డి.వాణికు అధికారులు మెమోలు జారీ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ భాస్కర్ గురువారం వెల్లడించారు. తనిఖీకి వెళ్లిన సమయంలో వారు విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లుగా గుర్తించామన్నారు. మూడు రోజుల్లోపు వారు వివరణ ఇవ్వకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్



బీటర్లను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తాడిపత్రి టౌన్: స్థానిక శాంతి నగర్ ఆర్చ్ వద్ద ఖాళీ ప్రదేశంలో మట్కా రాస్తున్న ముకుందర్ మున్నీర్ బాషా, బద్వేల్‌బాషా మొహిద్దీన్, పల్లెల గోవర్దన్, వెన్నపూస లక్ష్మీనారాయణ, నడిపి వెంకటనారాయణను అరెస్ట్ చేసినట్లు సీఐ సాయి ప్రసాద్ తెలిపారు. అందిన సమాచారంతో ఎస్‌ఐ గౌస్‌బాషా, సిబ్బంది అక్కడకు చేరుకుంటుండగా గమనించిన మరో బీటర్ ముకుందర్ ఖాజా అలియాస్ లప్ప ఖాజా పరారయ్యాడన్నారు. మిగిలిన ఐదుగురిని అరెస్ట్ చేసి రూ.1.70 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బడ్జెట్ అరకొర... సీఎస్‌లు విలవిల

- పరీక్షల నిర్వహణకు అరకొర నిధులు కేటాయించిన ప్రభుత్వం
- చేతి నుంచి అదనంగా ఖర్చు పెడుతున్న సీఎస్‌లు



తాడిపత్రి రూరల్: పదో తరగతి పరీక్షల నిర్వహణకు గాను కూటమి ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఎందుకూ సరిపోవడం లేదు. అదనపు నిధుల కోసం ఉపాధ్యాయ సంఘాలు చేసిన వినతిపై ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. దీంతో పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ల (సీఎస్) జేబులకు చిల్లు పడుతోంది.

వైఎస్ జగన్ చొరవతో..

పదో తరగతి పరీక్షల నిర్వహణకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. 2018లో ఒక్కో విద్యార్థికి కంటింజెంట్ చార్జీ కింద రూ.5.50లు మాత్రమే ప్రభుత్వం చెల్లించేది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పెరిగిన ధరలను అప్పటి సీఎం వైఎస్ జగన్ దృష్టిలో ఉంచుకుని కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ 2020, 2021, 2023లో కంటింజెంట్ చార్జీ రూ.5.50 నుంచి రూ.8కు పెంచారు. 2024లో రూ.10కు పెంచారు. ప్రస్తుతం అదే చార్జీలనే కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోంది. పెరిగిన ధరలకు అనుగుణంగా పరీక్షల నిర్వహణకు ఈ నిధులు సరిపోక అదనపు మొత్తాన్ని సీఎస్‌లే భరిస్తున్నారు.

అరకొర నిధులతో సతమతం

పోలీసు స్టేషన్లల్లో భద్రపరిచిన ప్రశ్న పత్రాలను పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు, పరీక్షల అనంతరం జవాబు పత్రాలను తపాలా కార్యాలయానికి తరలించేందుకు రవాణా ఖర్చులు, కొవ్వొత్తులు, దారం, లక్క, స్టాప్‌లర్లు, స్కెచ్ పెన్నులు, గమ్, వైట్‌నర్ తదితర స్టేషనరీ కొనుగోలు తడిసి మోపెడవుతోంది. తెలుగు మీడియం, ఇంగ్లిష్ మీడియం, ఉర్దూ మీడియంల జవాబు పత్రాల కోసం వేర్వేరు సంచులను వాడుతున్నారు. ఒక్కో సంచి కోసం రెండు నుంచి మూడు మీటర్ల వరకు వస్త్రాన్ని వాడాల్సి వస్తోంది. దీంతో పరీక్షల నిర్వహణకు సంబంధించి కంటింజెంట్ చార్జీలను పెంచాలని కూటమి ప్రభుత్వానికి పలుమార్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. అయినా ప్రభుత్వం స్పందించలేదు. సాధారణంగా ఒక పరీక్ష కేంద్రంలో 100 మంది విద్యార్థులుంటే ప్రస్తుతం పరీక్ష నిర్వహణ కింద ఇస్తున్న ఒక్కో విద్యార్థికి రూ.10 చొప్పున 100 మందికి సంబంధించి కేవలం రూ.వెయ్యి మాత్రమే అందుతుంది. ప్రస్తుత ధరలతో పోల్చుకుంటే అన్ని ఖర్చులు కలిపితే రూ.5వేలకు పైగా అవుతుంది. దీంతో ప్రభుత్వం చెల్లించిన రూ.వెయ్యి పోను మిగిలిన రూ.4 వేలను సీఎస్‌లే భరించాల్సి వస్తోంది.

సీఎస్, డీఓలకు అరకొర భృతి

ప్రతి పరీక్ష కేంద్రానికి ఓ సీఎస్, డీఓను నియమించారు. 240మంది విద్యార్థులకు మించి ఉన్న కేంద్రానికి అదనంగా డీఓలు ఉంటున్నారు. సీఎస్‌లు, డీఓలు, కస్టోడియన్లు, ఇన్విజిలేటర్లకు రూ.150 నుంచి రూ.200ల భృతి కేటాయించాలన్న డిమాండ్‌ను సైతం ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణకు పెద్దగా తేడా లేకపోయినప్పటికి ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ఇన్విజిలేటర్లకు రూ.150 చెల్లిస్తుండగా పదో తరగతి పరీక్షల ఇన్విజిలేటర్లకు కేవలం రూ.33 మాత్రమే చెల్లిస్తున్నారు. వాటర్ బాయ్‌కి రూ.17లు, అటెండర్‌కు రూ.20లు చొప్పున భృతి చెల్లిస్తున్నారు. అరకొర భృతి చెల్లింపులపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

భృతి పెంచాలి

ప్రస్తుత ధరలకు అనుగుణంగా పరీక్షల నిర్వహణ ఖర్చులు, భృతిని ప్రభుత్వం పెంచాలి. సీఎస్‌లు, ఇన్విజిలేటర్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు రోజుకు రూ.150 నుంచి రూ.200 భృతి చెల్లించాలి. కంటిజెన్సీ నిధులనూ పెంచాలి.

– శివశంకరయ్య, ఉద్యోగ, ఉపాధ్యాయ సేవా సంఘం కన్వీనర్, తాడిపత్రి

'నారాయణ స్కూల్‌ను సీజ్ చేయాలి'



నారాయణ స్కూల్ విద్యార్థులను విచారణ చేస్తున్న ఎంఈఓ నాగమణి


రాయదుర్గంటౌన్: ముందస్తు అడ్మిషన్లతో పాటు విద్యా సంవత్సరం పూర్తి కాకనే 9వ తరగతి విద్యార్థులకు టెన్త్ సిలబస్ బోధిస్తున్న నారాయణ విద్యా సంస్థను తక్షణమే సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఈఓ నాగమణికి ఫిర్యాదు చేయడంతో గురువారం ఆమె క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఆమె వెంట విద్యార్థి సంఘాల నాయకులు బంగి శివ, ఆంజనేయులు, కార్తీక్, వలి, నవీన్, మహబూబ్ బాషా ఉన్నారు. పాఠశాలలో విద్యార్థులతో ఎంఈఓ మాట్లాడారు. నిబంధనలు ఉల్లఘించి పుస్తకాలు విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. పుస్తకాలు నిల్వ ఉంచిన గదిని సీజ్ చేశారు. జిల్లాలోని నారాయణ విద్యా సంస్థలు ఎన్ని అక్రమాలకు పాల్పడుతున్నా, ఆ కళాశాల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వంలో ఎంత మాత్రం చలనం లేదని ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నారాయణ విద్యాసంస్థలను మూసేయాలని డిమాండ్ చేశారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం సిటీ: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని అశోక్‌నగర్ రెండో క్రాస్‌లో నివాసముంటున్న అమ్మినేని వెంకటనాయుడు, రమాదేవి దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు తరుణ్ కుమార్(28) ఉన్నారు. కుమార్తె సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా అహమ్మదాబాద్‌లో పనిచేస్తున్నారు. తరుణ్‌కుమార్ ఎంబీఏ చదువుతూ మధ్యలోనే ఆపేసి, ఇంటి పట్టునే ఉంటున్నాడు. ఈ క్రమంలో పలు ఉద్యోగ ప్రయత్నాలు చేసిన అవకాశాలు దక్కలేదు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. చివరకు మద్యం కొనుగోలుకు డబ్బు కావాలంటూ తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి మద్యానికి అవసరమైన డబ్బు కోసం కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయినా తరుణ్‌కుమార్... నేరుగా మారుతీనగర్ సమీపంలోని రైలు పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న వెంకటనాయుడు, రమాదేవి అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతుడిని తరుణ్‌కుమార్‌గా నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

దళిత ఉద్యోగిపై టీడీపీ నేత జులుం

- చెప్పుతో కొట్టమంటూ భార్యను రెచ్చగొట్టిన వైనం



శింగనమల: దళితురాలైన ఓ మహిళా ఉద్యోగిపై టీడీపీ నేత తన దూకుడు ప్రదర్శించాడు. చెప్పుతో కొట్టమంటూ భార్యను రెచ్చగొట్టి వివాదానికి తెర దీశాడు. ఘటనపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. వివరాలు... శింగనమల వెలుగు కార్యాలయంలో దళితురాలైన సరస్వతి సీసీగా పనిచేస్తోంది. శింగనమలలోని చితంబరస్వామి మహిళా సంఘం సభ్యురాలు వెంకటలక్ష్మి తన గ్రూపులోని సభ్యురాలు భారతి పేరుపై ఇప్పటికే రూ.50 వేలు తీసుకున్నారు. ఈ క్రమంలో పొదుపులో నుంచి మరో రూ.10 వేలు తీసుకునేందుకు వెంకటలక్ష్మి సిద్ధమైంది. దీంతో గురువారం సీసీని కలసి సంప్రదించింది. ఇప్పటికే మహిళా సంఘాల్లో అక్రమాలు బయటపడుతున్నాయని, ఒకరి పేరు మీద మరొకరు రుణం తీసుకోవడం సరికాదని సీసీ తెలిపింది. తీసుకునే రుణమేదో వ్యక్తిగత పేరుపైనే తీసుకోవాలని సూచించింది. దీంతో తన ఖాతా హోల్డ్‌లో ఉండడంతో బంధువైన భారతి పేరుపై తీసుకుంటున్నట్లు వెంకటలక్ష్మి సర్దిచెప్పింది. దీంతో భారతి పేరుపై పొదుపు రుణాన్ని తాను తీసుకుంటున్నట్లు తీర్మానంలో రాసుకుని వస్తే పని పూర్తి చేస్తానని సీసీ తెలపడంతో వెంకటలక్ష్మి ఇంటికి వెళ్లిపోయింది. కాసేపటి తర్వాత తన భర్త ఆదినారాయణ (రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్)ను వెంటబెట్టుకుని కార్యాలయానికి వచ్చిన వెంకటలక్ష్మి... తీర్మానం కాపీపై సీసీతో సంతకం చేయించుకుని తిరుగు ప్రయాణమైంది. అయితే అప్పటికే కార్యాలయం బయట వేచి ఉన్న ఆదినారాయణ... సీసీని బయటకు రమ్మంటూ కేకలు వేయడంతో ఆయనకు సర్దిచెప్పి పిలుచుకెళ్లే ప్రయత్నం చేసింది. అయినా ఆయన గట్టిగా దుర్భాషలాడుతూ కేకలు వేస్తుండడంతో సీసీ సరస్వతి కార్యాలయం బయటకు వచ్చింది. ఆమెను చూడగానే తన భార్యను చూస్తూ 'చెప్పు తీసుకుని దాన్ని కొట్టు' అంటూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడు. అక్కడున్న వారు వారించబోతే 'చెప్పుతో కొడతా.. మెట్టుతో కొడతా.. నన్నేవరూ ఏమీ చేసుకోలేరు' అంటూ .. మరింత రెచ్చిపోయాడు. ఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు.

అట్టహాసంగా ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ

అనంతపురం: ఏపీఎల్ క్రికెట్ తరహాలోనే ఫుట్‌బాల్‌లో ఏపీ సూపర్ కప్ టోర్నీని నిర్వహిస్తున్నట్లు ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ తెలిపారు. ఈ నెల 27వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీ గురువారం అనంతపురంలోని ఆర్డీటీ క్రీడాగ్రామంలో అట్టహాసంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలను 8 జోన్లుగా విభజించి 8 క్లబ్బులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో వంశధార ఫుట్‌బాల్ క్లబ్ (శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాలు), విశాఖపట్నం ఫుట్‌బాల్ క్లబ్ (విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామ రాజు జిల్లాలు), గోదావరి ఫుట్‌బాల్ క్లబ్ (తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాలు), కొల్లేరు ఫుట్‌బాల్ క్లబ్ (ఏలూరు, తూర్పుగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు), నల్లమల ఫుట్‌బాల్ క్లబ్ (గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలు), కోరమాండల్ ఫుట్‌బాల్ క్లబ్ (నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలు), పెన్నా ఫుట్‌బాల్ క్లబ్ (కడప, శ్రీ సత్యసాయి, అన్నమయ్య జిల్లాలు), తుంగభద్ర క్రికెట్ క్లబ్ (అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాలు) ఉన్నాయన్నారు. ఒక్కో క్లబ్ నుంచి స్థానిక 11 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులు, మరో 11 మంది ఇతర రాష్ట్రాల క్రీడాకారులకు ప్రాతినిధ్యం కల్పించినట్లు వివరించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీని విజయవంతం చేయాలని కోరారు.

- తొలి రోజు జరిగిన ఉత్కంఠ పోరులో పెన్నా, కోరమండల్, కొల్లేరు, వంశధార జట్లు గెలుపొందాయి. తొలి మ్యాచ్‌లో తుంగభద్ర ఫుట్‌బాల్ క్లబ్‌తో తలపడిన పెన్నా ఫుట్‌బాల్ క్లబ్ జట్టు 2–4 గోల్స్ తేడాతో విజయాన్ని కైవసం చేసుకుంది. రెండో మ్యాచ్‌లో నల్లమల క్లబ్‌తో తలపడిన కోరమాండల్ క్లబ్ జట్టు ఆటలో ఆధిపత్యం కొనసాగిస్తూ 2–0 గోల్స్ తేడాతో విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో గోదావరి క్లబ్ జట్టుపై కొల్లేరు క్లబ్ జట్టు మూడు గోల్స్ సాధించి ఘన విజయం సాధించింది. అలాగే విశాఖ జట్టుపై తలపడిన వంశధార క్లబ్ జట్టు వరుసగా మూడు గోల్స్ సాధించి విజయ కేతనం ఎగురవేసింది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

SUMMER CAMP

■ **Spoken English, Grammar,** Beautiful Handwriting, Maths, Physics, Chemistry # A.G. REDDY ACADEMY, Sai Nagar, 7th cross, ATP. 9000490141, 9019795268. [A-1544]

SERVICES

■ రుణాలు,వ్యక్తిగత,వ్యవసాయం,వ్యాపారం రుణం తక్కువ వడ్డీరేటు, సిబిల్ అవసరం లేదు, NPAవారు కూడా సలహాల కొరకు సంప్రదించండి. పార్థిబా, 9121625779. [T-314]

CHANGE OF NAME

■ **I, G Ram Sai Prasad S/o K** Venkataramanappa R/o.H No. 1-10a, Palasamudram Gorantla, Ananthapuramu, Andhra Pradesh - 515241, Have Changed The Name of My Minor Son Namely G Partha Sarathi (Aged 14 Years) And He Shall Hereafter Be Known As Gurrappagari Partha Sarathi For All Future Purposes. [DA-37311]

WANTED

■ **KLD లో, ప్రముఖ ఎడ్యుకేషనల్ ఆఫీస్** కొరకు లేడీ టెలికాలర్స్ కావలెను. Q: ఇంటర్ / డిగ్రీ, ఆపైన. 6304109997, 9346781049, 8885533013 [A-1545]

■ **Wanted Technician** 10th ITI, Inter, P/F.Work with aquaguard service center opportunity earn 10-20K Per month training will provide 9966339211 [SCA-25002260]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

■ **JOBS:** కిచెన్ వేర్ ఐటమ్స్, జిల్లా వ్యాప్తంగా మార్కెటింగ్ కొరకు, అనుభవంగల సేల్స్ ఎగ్జిక్యూటివ్ కావలెను. మంచి జీతం + ఇన్సెంటివ్ + TA, DA ఇవ్వబడును. # శ్రీ విష్ణు ఎంటర్‌ప్రైజెస్, ATP. 9000786886, 7207472886. [A-1542]

■ **Universal** కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459. [SCA 25002218]

■ **JOBS WANTED : Ex Service** men at Jellipalli toll plaza - Y.Meenakshi. Jellipalli (V), Kuderu(M), Anantapur (Dist.), Contact: 8130006299 [SCA25002251]

■ **Wanted Technical Persons /** Evaluators for purchase of used cars. Candidates with Prior experience / Freshers (ITI / Diploma/ Degree) / Service Advisors (4 W) may apply. 4W Driving License is compulsory. Cont: 8333929186. [A-726]

■ **Wanted / Assistant Manager for** Anantapur. Biggest Furniture Showroom "Mamatha Furniture". (Salary: 20,000 + Incentive. Requirements / Education: Degree / 2 yrs. Retail experience / Basic Computer Skills) Interview Date & Time : 20 & 21 March at 11-00 AM to 5-00 PM. Address: గుత్తి రోడ్డు, మార్కెట్ యార్డ్ ఎదురుగా, అనంతపురం. [A-1546]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
అద్దెకు
ఫర్నీచర్స్
ఆటోమొబైల్
కంప్యూటర్స్
సర్వీసెస్
4 లైన్లు రూ॥ 270/-
అదనపు లైను రూ॥ 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088
RAYADURG : 9010470185

గాలికుంటు నివారణకు వ్యాక్సిన్

ఉరవకొండ: గాలికుంటు వ్యాధి నివారణకు జీవాలకు వ్యాక్సిన్ వేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వెంకటస్వామి తెలిపారు. మండల పరిధిలోని షేక్షానుపల్లి గ్రామంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద ఈ నెల 30 వరకూ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే ప్రమాదకరమన్నారు. సీజనల్ వ్యాధుల నుంచి పశువులకు రక్షణ కల్పించడానికి వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలన్నారు. 4 నుంచి 9 నెలల్లోపు దూడలకు బ్రూసెల్లోసెస్ వ్యాధి నిరోధక టీకాలు కూడా వేయించాలన్నారు. పశువులకు టీకాలు వేసిన అనంతరం వాటి చెవులకు పోగు వేసి వాటి యజమాని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్, ఏడీ పెద్దన్న, సిబ్బంది సిరాజ్, రామాంజి, కరీముల్లా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గుత్తి: గూడ్స్ రైలు ఢీకొని తీవ్రం గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు... గుత్తి మండలం జక్కలచెరువు గ్రామానికి చెందిన రాజశేఖర్ (42) బుధవారం రాత్రి బహిర్భూమికని గ్రామ సమీపంలోని రైలు పట్టాలు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన గూడ్స్ రైలు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజశేఖర్‌ను కుటుంబ సభ్యులు గుత్తిలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం ఆయన మృతి చెందాడు. ఘటనపై జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

భార్య చెవి కోసిన భర్త అరెస్టు

పెద్దపప్పూరు: మద్యానికి బానిసైన ఓ భర్త తన భార్య చెవి కోశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. వివరాలు.. మండలంలోని వరదాయపల్లికి చెందిన శ్రీనివాసులు, నాగేశ్వరి దంపతులు. వ్యవసాయ కూలీ అయిన శ్రీనివాసులు ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. మందు తాగేందుకు డబ్బు ఇవ్వమంటూ భార్యను వేధించేవాడు. ఇలాగే, గత నెల 17న భార్యతో గొడవకు దిగాడు. ఆమె తన దగ్గర డబ్బు లేదని అనడంతో కోపోద్రిక్తుడయ్యాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న శ్రీనివాసులు తన భార్య నాగేశ్వరి కుడి చెవికున్న కమ్మ కోసం ఏకంగా చెవిని కోసి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పెద్దపప్పూరు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలించారు. ఈ క్రమంలోనే గురువారం పులివెందులలో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. అనంతరం కోర్టుముందు హాజరు పరిచి రిమాండుకు తరలించారు.

● రోడ్డెక్కిన గాంధీ

నోటుపై గాంధీ..
నడిరోడ్డుపై ఏంటి?
ఆకలి దప్పులు..
రోజు తిప్పలు
పచ్చడి మెతుకుల కోసం..
తప్పని జీవన సమరం
దేహానికి రంగులు..
దేహీ అంటు వేడుకోలు
సమాజమా.. సిగ్గనిపిస్తోందా
అయ్యో అనక..
శాశ్వత పరిష్కారం చూపు



... గురువారం ఖాద్రీశుడి రథోత్సవంలో కనిపించిన ఈ చిన్నారి గాంధీను చూసి కొందరు అయ్యో అంటే.. మరికొందరు ఆహా అంటూ ఫొటోలు తీసుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

వృద్ధురాలిపై దాడి


గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు మారెమ్మపై అదే గ్రామానికి చెందిన ఐదుగురు గురువారం దాడి చేసి గాయపరిచారు. గ్రామంలోని జంగాల కాలనీకి చెందిన మారెమ్మ కుటుంబ సభ్యులతో పొరుగింటి వారికి విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో గురువారం రెండు కుటుంబాల మధ్య ఘర్షణ తలెత్తడంతో మాటామాటా పెరిగి మారెమ్మపై విచక్షణారహితంగా దాడి చేశారు. గాయపడిన మారెమ్మను కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పీఎం యోగా అవార్డుకు దరఖాస్తులు

అనంతపురం కల్చరల్: ప్రధానమంత్రి యోగా అవార్డుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. యోగా ప్రచారం, అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేస్తున్న వారు అర్హులన్నారు. కనీసం 40 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు https://innovateindia.mygov.in/te/వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

హిందీ అమలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత

- డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా



ఉద్యోగికి ప్రశంసా పత్రం అందిస్తున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు: రాజభాష హిందీని అమలు చేయడం బాధ్యతగా తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా పిలుపునిచ్చారు. రాజభాష అమలుల్లో ప్రతిభ కనబరిచిన దాదపు 51 మంది ఉద్యోగులకు గురువారం ఆయన ప్రశంసా పత్రాలను అందజేసి, అభినందించారు. రాజభాషా నియమాలను అనుసరించి ఉద్యోగులు తమ కార్యాలయాల్లో విధి నిర్వహణలో తప్పనిసరిగా హిందీ మాట్లాడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ రామకృష్ణ, డివిజన్ రాజభాష అధికారి ఆశా మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

27న ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐదు ఎంపీపీ, నాలుగు ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నికలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐదు మండల పరిషత్ అధ్యక్ష స్థానాలతో పాటు నాలుగు మండలాల్లో ఉపాధ్యక్ష పదవుల భర్తీకి సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. వీటికి ఈ నెల 27న ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ నేతృత్వంలో ఉమ్మడి జిల్లా పరిషత్ సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఎన్నికల విభాగం ఏర్పాటైంది. రొద్దం మండలం లోచర్ల ఎంపీటీసీ సభ్యుడిగా గెలిచి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన పి.చంద్రశేఖర్, రామగిరి మండలం రామగిరి ఎంపీటీసీగా గెలిచి ఎంపీపీగా పని చేసిన మీనుగ నాగమ్మ మరణించడంతో ఆ రెండు మండలాల్లో ఎన్నిక అనివార్యమైంది. గాండ్లపెంట మండలం గొడ్డువెలగల ఎంపీటీసీగా గెలిచి ఎంపీపీగా పని చేసిన కాటం జగన్‌మోహన్, కణేకల్లు మండలం గనిగెర ఎంపీటీసీగా గెలిచిన హరిజన సంధ్య, కంబదూరు మండలం ములకూరు ఎంపీటీసీగా గెలిచి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన తిమ్మ రాజమ్మ తమ పదవులకు రాజీనామా చేయడంతో ఆయా స్థానాలకు ఎన్నిక నిర్వహిస్తున్నారు. అలాగే ఉరవకొండ మండలం బూదగవి మండల ఉపాధ్యక్షుడు నరసింహులు ఎంపీపీగా, పెద్దపప్పూరు మండల ఉపాధ్యక్షుడు జి.వెంకట్రామిరెడ్డి ఎంపీపీగా ఎన్నికయ్యారు. దీంతో ఆ రెండు మండలాల్లో వైస్ ఎంపీపీ స్థానాలకు ఎన్నిక జరగనుంది. యల్లనూరు మండల వైస్ ఎంపీపీగా పని చేసిన వెంకటరంగయ్య, రాయదుర్గం మండల వైస్ ఎంపీపీ సత్యనారాయణ నాయుడు అకాల మరణంతో ఆ రెండు స్థానాలకు ఎన్నిక నిర్వహించనున్నారు.

ఎస్కేయూలో కొనసాగుతున్న గ్యాంగ్‌వార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో గ్యాంగ్ వార్ పరంపర కొనసాగుతోంది. ఆధిపత్య పోరులో విద్యార్థులు గ్రూపులుగా విడిపోయి బాహాబాహీకి తలపడుతున్నారు. రెండు రోజుల క్రితం క్యాంపస్‌లోని ఫార్మసీ విద్యార్థుల మధ్య గ్యాంగ్ వార్ ఘటనను మరువకనే బుధవారం రాత్రి మరోసారి ఎల్ఎల్‌బీ, ఎంబీఏ విద్యార్థులు కొట్టుకున్నారు. వివరాలు... బుధవారం రాత్రి ఎంబీఏ హాస్టల్ వద్దకు ఎల్ఎల్‌బీ ఫైనలియర్ విద్యార్థి వెళ్లడంతో ఇక్కడ నీకేం పని అంటూ అక్కడే ఉన్న ఎంబీఏ ఫైనలియర్ విద్యార్థులు నిలదీశారు. దీంతో వారి మధ్య మాటామాట పెరిగింది. దీంతో వ్యక్తిగత ప్రతిష్టకు పోయిన ఎల్ఎల్‌బీ విద్యార్థి వెంటనే తన స్నేహితులకు ఫోన్ చేసి ఎంత మంది ఉంటే అంత మంది ఎంబీఏ హాస్టల్ వద్దకు చేరుకోవాలన్నాడు. దీంతో ద్విచక్ర వాహనాలపై అక్కడకు చేరుకున్న ఎల్ఎల్‌బీ విద్యార్థులకు, అక్కడే ఉన్న ఎంబీఏ విద్యార్థులు బాహాబాహీకి దిగారు. పరస్పర భౌతిక దాడులతో యుద్ధ వాతావరణం నెలకొంది. ఎంబీఏ విద్యార్థి చేతికి, లా విద్యార్థి కన్నుకు గాయాలయ్యాయి. ఘటనపై ఇరువురు క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు ఏడుగురు ఎంబీఏ విద్యార్థులు, పది మంది ఎల్ఎల్‌బీ విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు ఇటుకలపల్లి పోలీసులు తెలిపారు.

దగాకోరుపై దండెత్తిన అన్నదాతలు



వ్యాపారిని చుట్టుముట్టిన రైతులు

కణేకల్లు: కొనుగోలు చేసిన పంట ఉత్పత్తులకు డబ్బు కట్టకుండా అలసత్వం వహించిన ఓ దగాకోరుపై అన్నదాతలు దండెత్తారు. వివరాలు.. మండలంలోని పెనకలపాడు గ్రామానికి చెందిన వ్యాపారి క్రిష్టారెడ్డి రైతుల నుంచి శనగలను కొనుగోలు చేసి రూ.4 కోట్లకు పైగా శఠగోపం పెట్టాడు. బాధిత రైతులు జిల్లా ఎస్పీని కలిసి న్యాయం చేయాలని వేడుకోగా.. క్రిష్టారెడ్డి దారికొచ్చాడు. దశలవారీగా డబ్బు చెల్లిస్తానని హామీ ఇచ్చాడు. ఇందులో భాగంగా ఈనెల 9న రూ. కోటి మేర రైతులకివ్వాల్సి ఉంది. అయితే, డబ్బు కోసం ఆ రోజు నుంచి రైతులు అతని చుట్టూ తిరుగుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. గురువారం దాటవేసేలా మాట్లాడటంతో బాధిత రైతులకు కడుపు మండిపోయింది. క్రిష్టారెడ్డి, అతని కుమారుడు సోమశేఖర్‌ను గ్రామంలో ఉన్న రాములోరి ఆలయం వద్దకు పిలుచుకొచ్చి కట్టపై కూర్చోబెట్టారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ వదల్లేదు. విషయం తెలుసుకొన్న ఎస్‌ఐ నాగమధు.. ఏఎస్‌ఐ ఈశ్వరయ్య, పోలీసులను గ్రామానికి పంపించారు. గొడవల్లేకుండా సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ క్రమంలోనే తండ్రీకొడుకులు మాట్లాడుతూ... శ్రీరామనవమి తర్వాత కొంత డబ్బిస్తానని చెప్పడంతో రైతులు వారిని వదిలిపెట్టారు.

ఇష్టారాజ్యం

- గ్యాస్ పైప్‌లైన్ పనుల పేరుతో రోడ్ల ధ్వంసం
- నగరంలో దెబ్బతింటున్న రోడ్లు
- రూ.లక్షల ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు శాపంగా మారుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1,000 కోట్లతో అనంతపురంలోని 50 డివిజన్లలో రోడ్లు, కాలువలు, తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వంలోని 10 నెలల కాల వ్యవధిలో అభివృద్ధి పనులు జరగకపోగా.. గ్యాస్ పైప్‌లైన్ పనుల పేరుతో నగరంలో ఎక్కడ పడితే రోడ్లను ధ్వంసం చేస్తున్నారు. అక్కడక్కడ గుంతలు పెట్టడంతో రోడ్లు ఛిద్రమవుతున్నాయి. పైప్‌లైన్ పనులు చేపడుతున్న సదరు ఏజెన్సీ రోడ్లు, కాలువల పునరుద్ధరణ పనులు చేపట్టేలా చూస్తే బాగుంటుందని నగర ప్రజలు కోరుతున్నారు.

ఇంజినీరింగ్ అధికారుల దుమ్మా..

ఓ గ్యాస్ పైప్‌లైన్ కంపెనీ నగరంలోని వివిధ ప్రాంతాల్లో పైప్‌లైన్ పనులు చేపడుతోంది. నగరపాలక సంస్థ అనుమతులు తీసుకుని నగరంలోని నాయక్ నగర్, అరవింద నగర్, జేఎన్‌టీయూ రోడ్డు, తదితర ప్రాంతాల్లో 3.7 కిలోమీటర్లలో పైప్‌లైన్ వేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే అరవింద నగర్ ప్రాంతంలో గుంతలు తవ్వి పైప్‌లైన్ పనులు చేశారు. ప్రస్తుతం నాయక్ నగర్‌లో గ్యాస్ పైప్‌లైన్ పనులు చేపడుతున్నారు. వాస్తవంగా ఈ పనులు చేసే సమయంలో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు అందుబాటులో ఉండాలి. కానీ అటువంటి పరిస్థితి లేదు. కేవలం ప్రైవేట్ నిర్వాహకులు ఇష్టానుసారంగా రోడ్డు, కాలువలకు కోతలు పెడుతున్నారు. దీంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్లు దెబ్బతింటున్నాయి. సదరు కంపెనీ భవిష్యత్తులో రోడ్డు కటింగ్ పనులను పూర్తీ స్థాయిలో చేస్తామని చెబుతున్నా.. జేసీబీ, డ్రిల్‌తో రోడ్డు కోత పెడుతుండటంతో రోడ్డు దెబ్బతినే పరిస్థితి లేకపోలేదు. ఇప్పటికే నగరంలో ఎక్కడ పడితే అక్కడ గుంతలు కనిపిస్తున్నాయి. నగరపాలక సంస్థ నిధులతో గుంతలు పూడ్చేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం గగనమైంది. అటువంటిది ఓ ప్రైవేట్ కంపెనీ నిర్వాహకులు కోత పెట్టిన రోడ్డును బాగు చేస్తామని చెబుతుండటం విమర్శలకు దారి తీస్తోంది.


నాయక్ నగర్‌లో గ్యాస్ పైప్‌లైన్ కోసం రోడ్డుపై గుంతలు తీస్తున్న దృశ్యం

ప్రైవేట్ కంపెనీతో కుమ్మక్కు..

కూటమి ప్రభుత్వంలో ఓ ప్రైవేట్ కంపెనీ చేపట్టబోయే రూ.లక్షల టర్నోవర్‌కు నగరపాలక సంస్థ అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నట్లు సమాచారం. నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్ విభాగంలోని పలువురు అధికారులతో ప్రైవేట్ కంపెనీ కుమ్మక్కైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొదట్లో వీటి నిర్వహణకు అవకాశం ఇవ్వలేదు. కూటమి ప్రజాప్రతినిధుల ఆదేశాలతో పలువురు ఇంజినీరింగ్ అధికారుల కనుసన్నల్లో గుట్టుచప్పుడు కాకుండా పనులు జరుగుతున్నాయి.

ఆ ఫైల్ చూసి చెబుతా

ఇటీవల ఆ పనులకు సంబంధించి విషయం నాకు తెలిసింది. ఏఈతో ఆ ఫైల్‌ను తీసుకుని నగరంలో ఎక్కడెక్కడ పనులు జరుగుతున్నాయో.. రోడ్లు ఎంత మేరకు కోతకు గురవుతున్నాయో తెలుసుకుంటాం. ఆ ఫైల్‌ను పూర్తీగా చూసి నివేదిస్తా.

– టీఎల్ నరసింహ, ఇన్‌చార్జ్ ఈఈ

నగరపాలక సంస్థ వివరాలు..

డివిజన్లు	50
సచివాలయాలు	74
పైప్‌లైన్ జరిగే దూరం	3.7 కిలోమీటర్లు
ప్రస్తుతం పైప్‌లైన్ జరిగే ప్రాంతాలు	అరవింద నగర్, నాయక్ నగర్, జేఎన్‌టీయూ రోడ్డు

క్లుప్తంగా

అంధ విద్యార్థులకు చేయూత


అంధ విద్యార్థులతో హూండాయ్ కంపెనీ ప్రతినిధులు

అనంతపురం సెంట్రల్: అంధ విద్యార్థులకు సాంకేతిక చేయూతనందించేందుకు హూండాయ్ కార్ల కంపెనీ ముందుకొచ్చింది. గురువారం నగరంలో మీనాక్షమ్మ ఇన్‌క్లూజివ్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు 10 కంప్యూటర్లు, 25 ల్యాప్‌టాప్‌లు, 35 హెడ్‌సెట్స్, ఒక ప్రింటర్, నాలుగు బ్రెయిలీ టైప్ మిషన్లను విరాళంగా అందజేశారు. ఈ వసతి గృహంలో దాదాపు 42 మంది విద్యార్థులు ఇంటర్, డిగ్రీ చదువుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ రమణమూర్తి, హుండాయ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ యంగ్ యంగ్ డ్వెక్, హెచ్‌ఆర్‌జీఏ కో–ఆర్డినేటర్ హొమిన్‌హో, హెచ్‌ఆర్‌జీఏ హెచ్‌ఓడీ శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ సింధూజ, మీనాక్షమ్మ సెంటర్ నిర్వాహకులు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య

రాప్తాడు: ఉపాధి కూలీలకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే వేతనాలు చెల్లించాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని బొమ్మేపర్తి, లింగనపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 4 వారాలకు సంబంధించిన బిల్లులు చెల్లించకుంటే కూలీలు ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. పని చేసిన 15 రోజుల్లోపు బిల్లులు చెల్లించకపోతే పరిహారం ఇవ్వాలని చట్టం చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పని ప్రదేశంలో కూలీలకు సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కూలీలకు అనుకూలమైన పనులు కల్పించి రోజు కూలీ రూ.600 వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి పోతులయ్య, నాయకులు సుబ్బారెడ్డి, అఖిల్ రెడ్డి పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు దూడలు



రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట సర్పంచ్ లక్ష్మీదేవికి చెందిన ఓ ఆవు గురువారం రెండు లేగదూడలకు జన్మనిచ్చింది. ఇందులో ఒకటి పెయ్యదూడ, రెండోది కుర్రదూడ. పశువైద్య అధికారికి సమాచారం ఇవ్వడంతో వచ్చి పరిశీలించారు. రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆవు ఒకేసారి రెండు దూడలకు జన్మనివ్వడం చాలా అరుదు అని సర్పంచ్ భర్త ఆదినారాయణ తెలిపారు.

మూల్యాంకనానికి మినహాయించాలి


డీఈఓ ప్రసాద్ బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం విధులకు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న టీచర్లు, చంటి పిల్లలు ఉన్న మహిళా ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు కోరారు. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 55 సంవత్సరాలు నిండిన ఉపాధ్యాయులను వారు కోరితేనే మూల్యాంకనం విధులకు వేయాలన్నారు. ముందుగానే సమాచారం తీసుకుని స్పాట్‌లో ఇబ్బంది పడకుండా మినహాయింపు ఇవ్వాలన్నారు. 100 రోజుల ఎస్ఎస్‌సీ కార్యక్రమం అమలులో భాగంగా సెలవు రోజుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరుకు మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమణా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి.సూర్యుడు, జిల్లా కౌన్సిలర్ శివయ్య ఆచారి, ఎస్.సురేష్ బాబు, మిద్దె మురళీ కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు నాగభూషణ, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, నాయకులు విరూపాక్షి గౌడ్, బాబ్జీ నాయక్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం


సీసీ రోడ్డుపై నిలిచిన మురుగును పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడు: రాప్తాడు పంచాయతీలోని గంగలకుంట గ్రామంలో నెలకొన్న పారిశుధ్య సమస్యలపై గురువారం సాక్షి దినపత్రికలో 'డ్రైనేజీ అస్తవ్యస్తం' పేరుతో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీఓ విజయలక్ష్మి వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్‌ను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రేమ్ కుమార్, వెంకట రమణా రెడ్డి తదితరులు స్థానిక యల్లమ్మ దేవాలయం వెనుక బీసీ కాలనీలో పర్యటించారు. బుల్లే పెద్ద నగేష్ ఇంటి ముందు సీసీ రోడ్డుపై నిలిచిన మురుగును పరిశీలించారు. ఈ సమస్య ఎప్పటి నుంచి ఉందని అధికారులు ఆరా తీశారు. ఏళ్ల నుంచి సమస్య ఉందని.. అధికారులు, నాయకులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. రెండు రోజుల్లో సీసీ రోడ్డుపై కాలువను తీసి మురుగు వెళ్లేలా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

సందడిగా మహిళా దినోత్సవం


కార్యక్రమానికి హాజరైన అవోపా నాయకురాళ్లు

అనంతపురం కల్చరల్: స్థానిక ఎస్ఎస్ ప్యారడైజ్ ప్రాంగణంలో గురువారం అవోపా (ఆర్యవైశ్య ఆఫీసర్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. శాస్త్రీయ నృత్యాలు, వన్ మినిట్ గేమ్స్‌లో చెప్పుకోండి చూద్దాం, లక్కీ డ్రా, తంబోలా, అదృష్ట వనిత వంటి వాటితో పాటూ సందేశాత్మకంగా ప్రదర్శించిన లఘు నాటికలు ఆకట్టుకున్నాయి. మహిళల అభివృద్ధికి అవోపా చేపడుతున్న సేవా కార్యక్రమాలను పలువురు ప్రశంసించారు. అంతకుముందు రోదసీ నుంచి భూమిని చేరుకున్న సునీత విలియమ్స్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అవోపా మహిళా విభాగ్ ప్రెసిడెంట్ గూడూరు అనురాధ, కన్వీనర్ కాకుమాని చంద్రకళ, అవోపా స్టేట్ చైర్‌పర్సన్ ఆరవేటి నిర్మల, డాక్టర్ అరుణ ఉమెన్ ఎంపవర్‌మెంట్ లీడర్ మేడా కృష్ణవేణి, రమాదేవి, అవోపా ఉమ్మడి జిల్లా ప్రెసిడెంట్ వెంకటేష్ బాబు, జనరల్ సెక్రటరీ సత్యరాం పాల్గొన్నారు.

సమస్యల సాధనే లక్ష్యంగా ఉద్యమాలు


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి

అనంతపురం అర్బన్: కార్మికుల సమస్యల సాధనే లక్ష్యంగా ఉద్యమాలు సాగిస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి అన్నారు. ఇందులో భాగంగా ఈనెల 22, 23 తేదీల్లో కార్మికులకు ప్రత్యేకంగా కార్యశాల నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 22వ తేదీ ఉదయం 10 గంటలకు అనంతపురం రూరల్ మండలం మన్నీల సమీపంలోని శ్రీకృష్ణ గార్డన్స్‌లో ఉమ్మడి జిల్లాకు సంబంధించి కార్యశాల ప్రారంభం అవుతుందన్నారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలన్నారు. స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బకాయి ఉన్న డీఏలు, సరెండర్ లీవులు చెల్లించాలన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై శిక్షణ తరగతుల్లో సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యశాలకు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, కార్య నిర్వాహక అధ్యక్షుడు కృష్ణుడు, నగర అధ్యక్షుడు చిరంజీవి, నాయకులు రాజు. వెంకటేష్, దుర్గాప్రసాద్, నగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు


అంబేడ్కర్ నగర్‌లో పర్యటించిన కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: 'నగరం పరిశుభ్రంగా ఉండేందుకు కార్మికులు విధులు నిర్వర్తింటారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటారు. అటువంటి కార్మికులు నివసించే అంబేడ్కర్ నగర్, రాణి నగర్‌లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని' ప్రజారోగ్యాధికారులను కమిషనర్ బాలస్వామి ఆదేశించారు. గురువారం నగరంలోని అంబేడ్కర్‌నగర్, రాణినగర్, మున్నానగర్, తదితర మురికివాడ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇంజినీర్లతో కమిషనర్ మాట్లాడారు. ప్రాధాన్యత క్రమంలో అవసరమున్న ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి నివేదిక సిద్ధం చేయాలన్నారు. కాలువల్లో చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించేలా చూడాలని సూచించారు. అనంతరం కమిషనర్ నగరంలో పర్యటించారు. పారిశుధ్య కార్మికులు తప్పకుండా ఆప్రాన్ వేసుకోవాలన్నారు. కాలువల్లో పనులు చేసే సమయంలో గ్లౌజులు, తదితర వాటిని వాడాలని తెలిపారు. నగరంలోని వివిధ కూడళ్లలో డివైడర్ల మధ్యలో మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేష్, నాగేంద్ర, కార్పొరేటర్ సాకే చంద్రలేఖ, వైఎస్సార్‌సీపీ నాయకులు కుళ్లాయి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో బోధించాలి


మాట్లాడుతున్న సీడీపీఓ ధనలక్ష్మి

రాప్తాడు: బాలల భవిత కోసం కేంద్ర ప్రభుత్వం మరో పథకానికి శ్రీకారం చుట్టింది. భావి భారత విజ్ఞానంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలన్న లక్ష్యంతో పోషణ్ బీ–పడాయిబీ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని సీడీపీఓ ధనలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని జిల్లా నీటి యాజమాన్య కార్యాలయంలో అనంతపురం రూరల్ డివిజన్ పరిధిలోని రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పౌష్టికాహార లోపాన్ని తగ్గించేందుకు శారీరక, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఆట పాటలతో కూడిన విద్య అందించడంతో పాటు వారి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు. నూతన విద్యా విధానం అనుసరించి అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యతతో కూడిన పౌష్టికాహారం, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత, ఝాన్సీ రాణి, లీలావతి, శ్రీవాణి, లావణ్య, జయశ్రీ, భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దాం


ముక్తాపురం గ్రామ అధ్యక్షుడు ఓబిలేసును సన్మానిస్తున్న దృశ్యం

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా చేసుకోవాలి. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ముక్తాపురం, మామిళ్లపల్లి, దాదులూరు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ నాగముని, మండల నాయకులు స్థానిక గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. పార్టీ కమిటీల నియామకంపై చర్చించారు. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేసే పార్టీ కార్యకర్తలు ముందుకు రావాలని కోరారు. అనంతరం గ్రామాల వారీగా పార్టీ కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముక్తాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అంకె పెద్ద ఓబిలేసు, మామిళ్లపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వై.రామకృష్ణారెడ్డి, దాదులూరు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జయరామిరెడ్డిని నియమించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అమరనాథరెడ్డి, పెద్దిరెడ్డి, రమణారెడ్డి, సర్పంచులు ఓబిరెడ్డి, నారాయణ, ముక్తాపురం రామకృష్ణ, వెంకటనారాయణరెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి, వెంకటనారప్ప, జనార్దన్‌రెడ్డి, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

చెన్నేకొత్తపల్లి: రైతులు పంటలను పండించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని టింబక్టు కలెక్టివ్ సంస్థ వ్యవస్థాపకులు మేరీ, బబ్లూ గంగూలీ సూచించారు. చెన్నేకొత్తపల్లిలోని సంస్థ కార్యాలయం వద్ద గురువారం రామగిరి, రొద్దం, చెన్నేకొత్తపల్లి మండలాలకు సంబంధించి పలు గ్రామాల్లోని 28 మంది రైతులకు ఒక్కొక్కరికి 30 పైపులు, 5 స్ప్రింక్లర్లను పంపిణీ చేశారు. సంస్థ 75 శాతం, రైతులు 25 శాతం వాటాతో పరికరాలను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంస్థ ఏడీ సుకన్య, సిబ్బంది శ్రీకాంత్, రమేష్ కుమార్, దుహిత గంగూలీ, రమీజా, మహేష్, జబీరాబేగం, రవి, సన్నప్పయ్య పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో ప్రతిభ


ప్రశంసా పత్రాలను చూపుతున్న విద్యార్థులు

అనంతపురం రూరల్: ఒలింపియాడ్ పరీక్షల్లో ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి తెలిపారు. గురువారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ అరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. సిల్వర్ జోన్ ఒలింపియాడ్ పరీక్షల్లో తమ స్కూల్ విద్యార్థులు 45 మంది పాల్గొన్నట్లు తెలిపారు. గణితంలో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. నాలుగు స్వర్ణాలు, మూడు రజత, ఒక కాంస్య పతకాలు సాధించారన్నారు.

'భూములు కబ్జా చేయలేదు'

రాప్తాడు: మేము ఎవరి భూములు కబ్జా చేయలేదు. కొంత మంది కావాలని మాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మౌనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు ఈశ్వరయ్య స్వామి పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ విజయకుమారికి ఈశ్వరయ్య స్వామి కుమారుడు మధు వినతిపత్రం అందజేశారు. ఆలయం చాటున 70 ఎకరాలు ప్రభుత్వ భూమి కబ్జా చేశామని, ఆరోపణలు చేయడం పత్రికల్లో వార్తా కథనాలు రాయించడం జరిగిందన్నారు. 27 సంవత్సరాలుగా మాపై, మా ఆశ్రమంపై ఎటువంటి ఆరోపణలు, అభియోగాలు లేవన్నారు. ఈ ఆరోపణలు కేవలం అసత్యమని.. భూ కబ్జాతో మాకు ఎటువంటి సంబంధం లేదన్నారు. మా ఆధీనంలో ఉన్న భూమికి అన్ని పత్రాలు, రికార్డులు ఉన్నాయని తెలిపారు. ఈ విషయంపై చర్చించేందుకు మేము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

శభాష్ పోలీస్..

నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో గురువారం మధ్యాహ్నం రోడ్డు దాటుతున్న ఓ యువకుడికి మూర్ఛ రావడంతో కిందపడిపోయాడు. గమనించిన ట్రాఫిక్ పోలీస్ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వాహనాల మధ్య నుంచి దూరి యువకుడికి అడ్డుగా నిలబడ్డారు. అక్కడ ఏమైందో ఎవరికీ అర్థం కాక వాహనదారులతో పాటు అటుగా రాకపోకలు సాగిస్తున్న వారు ఆందోళనకు గురయ్యారు. పడిపోయిన యువకుడిని పైకి లేపలేక ట్రాఫిక్ పోలీస్ ఇబ్బంది పడుతుండటంతో గమనించిన మరో ఇద్దరు యువకులు ఒక్క ఉదుటున అక్కడికి చేరుకున్నారు. మూర్ఛతో పడిపోయిన యువకుడి చేతిలో తాళం చెవులు పెట్టి, సపర్యలు చేశారు. 15 నిమిషాల తరువాత అతను స్పృహలోకి రావడంతో నీడ ఉన్న ప్రదేశానికి తరలించారు. ఆ తరువాత కుటుంబ సభ్యులను పిలిపించి యువకుడిని అప్పగించారు. ట్రాఫిక్ పోలీస్‌తో పాటు మరో ఇద్దరు యువకులను అక్కడున్న వారందరూ అభినందించారు.


మూర్ఛతో పడిపోయిన యువకుడికి సపర్యలు చేస్తున్న ట్రాఫిక్ పోలీస్

– అనంతపురం సిటీ:

నాటుసారా హానికరం


కనగానపల్లి: ఆరోగ్యానికి హానికరమైన నాటుసారాకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలి. సారా రహిత గ్రామాలుగా గుర్తింపు పొందాలని ఎక్సైజ్, ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ నాగ మదయ్య తెలిపారు. మండలంలోని వేపకుంట, భానుకోట, మద్దెలచెరువు గ్రామాల్లో గురువారం నవోదయం 2.0 కార్యక్రమంపై ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాటుసారా వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డీపీఈఓ గోవిందు నాయక్, ఏఈఎస్ శ్రీరామ్, స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అకడమిక్ ఆడిట్ పూర్తి


జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డితో సమావేశమైన ఎక్స్‌టర్నల్ ఆడిట్ కమిటీ సభ్యులు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో ఎక్స్‌టర్నల్ కమిటీ ఆడిట్ పూర్తయింది. కమిటీ పరిశీలన పూర్తయిన అనంతరం జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డికి సలహాలు, సూచనలు ఇచ్చారు. లైబ్రరీ కోసం నిర్మాణం చేసిన (ఇది వరకు జేఎన్‌టీయూ అనంతపురం పాలక భవనం) భవనంలో లైబ్రరీ ఏర్పాటు చేయాలని సూచించారు. లైబ్రరీ నిమిత్తం ఏర్పాటు చేసిన భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిటీ సూచించింది. కమిటీలో సభ్యులుగా ప్రొఫెసర్ పి.చంద్ర ఓబుళ రెడ్డి, ప్రొఫెసర్ కే.నాగభూషణ రాజు, ప్రొఫెసర్ సి.నాగరాజు, డాక్టర్ ఎల్.సుబ్రమణ్య శర్మ ఉన్నారు.

ఒంటిపూట తరగతులు నిర్వహించాలి


ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ అనితకు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ అధ్యాపకులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలలకు ఒంటిపూట తరగతులు నిర్వహించాలని ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనితకు వినతిపత్రం అందజేశారు. అలాగే అర్హత ఉన్న అధ్యాపకులకు పీహెచ్‌డీ గైడ్‌షిప్ కల్పించాలని కోరారు. బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో సభ్యులుగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పునరుద్ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధ్యాపకుల సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కే.శ్రీధర్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కే.జయప్ప, కార్యదర్శి డాక్టర్ ఎం.బాలాజీ నాయక్, డాక్టర్ కేశవులు, డాక్టర్ శివశంకర్, డాక్టర్ శ్రీలేఖ, తదితరులు పాల్గొన్నారు.



సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

అనంతపురము డివిజన్
9912220732, 9912220719, 9912220724
9010223702, 7093156622, 9010567770, 7093157766